# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పటిష్టమైన మౌలిక సదుపాయాలు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- భారత్, దక్షిణ కొరియా దేశాలు ప్రపంచానికి శాంతి సందేశాన్నిఅందిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెల్లడించారు.
- భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 18వేల 262 వేసవి ప్రత్యేక సర్వీసులను అందించనుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది.
- అహ్మదాబాద్ వేదికగా ముంబయ్ ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

===================

పటిష్టమైన మౌలిక సదుపాయాలు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఇండియన్ రైల్వేస్ ప్రొబేషనరీ అధికారులు, సెంట్రల్ ఇంజనీరింగ్ సర్వీస్ (రోడ్స్) అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో రాష్ట్రపతి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మౌలిక సదుపాయాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయగలమని చెప్పారు. రవాణా వ్యవస్థలు ప్రయాణ సాధనాలు మాత్రమే కాదని దేశ ఆర్థిక విస్తరణకు, సామాజిక వికాసానికి, జాతీయ సమైక్యతకు కూడా దోహదపడతాయన్నారు.

===================

భారత్, దక్షిణ కొరియా దేశాలు ప్రపంచానికి శాంతి స్థిరత్వ సందేశాన్ని అందిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. క్రీడలు, సాంస్కృతిక, సృజనాత్మక పరిశ్రమలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగాలలో పారిశ్రామిక సహకార కమిటీల ఏర్పాటు కోసం భారతదేశం, దక్షిణ కొరియా నాలుగు అవగాహన ఒప్పందాలపై ఈరోజు సంతకాలు చేశాయి. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని పెంపొందించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్‌ల మధ్య న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన చర్చల అనంతరం ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ), సెమీకండక్టర్లు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలలో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయడానికి భారత్-కొరియా డిజిటల్ బ్రిడ్జ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా నరేంద్రమోడీ వెల్లడిస్తూ...

(వాయిస్…31 సెకన్లు)

===================

భారతీయ రైల్వే రానున్న మూడు నెలలలో దేశవ్యాప్తంగా 18వేల 262 వేసవి ప్రత్యేక సర్వీసులను అందించనుందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలియజేసింది. వేసవి కాలంలో ప్రయాణికులకు సులభమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీ

నుండి జూలై 15 వరకు పెరిగిన ప్రయాణ అవసరాలను తీర్చడానికి మొత్తం 908 వేసవి ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు పేర్కొంది. వీటి ద్వారా 18వేల 262 ట్రిప్పులను దేశవ్యాప్తంగా నడుపుతాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఎల్‌పిజి సరఫరా స్థిరంగా ఉందని కేంద్ర ప్రభుత్వం ఈరోజు తెలిపింది. న్యూఢిల్లీలో జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ, దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తిని పెంచడం, పట్టణ గ్రామీణ ప్రాంతాలలో బుకింగ్ వ్యవధిని పొడిగించడం, డెలివరీ అథెంటికేషన్ కోడ్‌ను అమలు చేయడం వంటి వాటి ద్వారా ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. డెలివరీ అథెంటికేషన్ కోడ్ వినియోగాన్ని 90 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా అది ఇప్పటికే 92 శాతానికి చేరుకుందని ఆమె తెలిపారు. వాణిజ్య సరఫరా కూడా 70 శాతం వరకు పునరుద్ధరించబడిందని సుజాతా శర్మ చెప్పారు. ఓడరేవులు నౌకా రవాణా మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మన్‌దీప్ సింగ్ రంధావా మాట్లాడుతూ, 97 వేల మెట్రిక్ టన్నులకుపైగా ముడి చమురును తీసుకువెళ్తున్న భారత దేశ క్రూడ్ ట్యాంకర్, ఈ నెల 18వ తేదీన హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి యువతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలను తీసుకుంటోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా  తెలిపారు. ఈ ఏడాది మొదటి మూడు నెలలలో 73 మంది మాదకద్రవ్యాల నేరస్థులకు అత్యంత కఠినమైన శిక్షలు విధించి దోషులుగా నిర్ధారించిన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో పనితీరుని ప్రశంసించారు. మాదకద్రవ్యాల సరఫరాకు  ఏమాత్రం ఆస్కారం లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకుందని సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

భారత్, దక్షిణ కొరియా మధ్య 27 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యం రాబోయే నాలుగేళ్లలో రెట్టింపు చేయాలన్నది ఉమ్మడి లక్ష్యమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన భారత్-కొరియా బిజినెస్ ఫోరమ్ ప్రారంభ సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, వ్యాపార ప్రక్రియలను మరింతగా సరళీకృతం చేయడం, సమగ్ర ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయని ఆయన చెప్పారు. భారత్, దక్షిణ  కొరియాల మధ్య వేల సంవత్సరాల నాటి సుదీర్ఘ సంబంధం ఉందని గుర్తు చేశారు. ప్రస్తుతం 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం, 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తన రెండు రోజుల శ్రీలంక పర్యటనలో భాగంగా నొవెర ఎలియాకు ఈరోజు చేరుకున్నారు. అక్కడ స్థానిక ప్రజలు ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీలంకలోని భారత సంతతి తమిళ సమాజం జీవన పరిస్థితులను మెరుగుపరిచే లక్ష్యంతో ఇండియన్ హౌసింగ్ ప్రాజెక్ట్ కింద నిర్మించిన ఇళ్లను ఉపరాష్ట్రపతి సందర్శించారు. ఆయన అక్కడి ప్రజలతో మాట్లాడి అనుభవాలను తెలుసుకున్నారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే, ప్రధానమంత్రి హరిణి అమరసూరియలతో నిన్న జరిపిన సమావేశంలో  విస్తృత చర్చలు జరిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం  ప్రతిపాదించిన డీ-లిమిటేషన్ వల్ల తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్లు గణనీయంగా పెరిగేందుకు వీలు అయ్యేదని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. మహిళా రిజర్వేషన్, డీ-లిమిటేషన్ బిల్లులను వ్యతిరేకించడం ద్వారా ప్రతిపక్షాలు మహిళల ఆకాంక్షలను నెరవేరకుండా చేశాయని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమిళనాడులోని కోయంబత్తూరులో పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ ప్రధానమంత్రి  నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఈ బిల్లులను తీసుకొస్తే,

కేవలం సంకుచిత రాజకీయాల కోసం ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని ఆరోపించారు. ఇదిలా ఉండగా గంగా కావేరీ నదుల అనుసంధానం జరిగితే దేశవ్యాప్తంగా నీటి కొరత తీరుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేస్తూ...

(వాయిస్...28 సెకన్లు)

===================

అహ్మదాబాద్ లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా ముంబయ్ ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన గుజరాత్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ముంబయ్ జట్టు 10 ఓవర్లు పూర్తయ్యేసరికి 3 వికెట్ కోల్పోయి 75 పరుగులు చేసింది.

===================

దేశంలోని రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో రానున్న మూడు రోజులలో వడగాలుల పరిస్థితులు నెలకొంటాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. పశ్చిమ బెంగాల్, కోస్తా ఆంధ్రప్రదేశ్, కోస్తా కర్ణాటక, కేరళ, మాహేలలో వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు ఉంటాయని పేర్కొంది. ఇదిలా ఉండగా అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయలోని కొన్ని ప్రాంతాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు రేపు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 133వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

===================

===================